ప్రజాశక్తి

ఆదివారం 6 అక్టోబర్ 2024 | 5 | అనంతపురం



ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి - బ్రహ్మసముద్రం

ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు యువకులు మృతిచెందిన సంఘటన బ్రహ్మసముద్రం మండలం ముప్పులకుంట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు... ముప్పులకుంట గ్రామానికి చెందిన వన్నూరుస్వామి, లక్ష్మీకాంత్ గొర్రెల కాపరులు. ఈ నేపథ్యంలో వీరు శనివారం ట్రాక్టర్ తీసుకుని వ్యవసాయ పొలంలో రోటవెయిటర్ చేయడానికి వెళ్లారు. పని అనంతరం ఇంటికి వస్తున్న సమయంలో వర్షంకారణంగా బురదమయంగా ఉన్న రోడ్డులో వీరి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద పడి వన్నూరుస్వామి(21), లక్ష్మీకాంత్(19) అక్కడికక్కడే మృతిచెందారు. యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతులు వన్నూరుస్వామి, లక్ష్మీకాంత్

బిజెపి హయాంలో విద్యారంగం నిర్వీర్యం

ఎస్ఎఫ్ఐ అఖిలభారత మాజీ అధ్యక్షులు వై. వెంకటేశ్వర్లు
ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి వర్క్ షాప్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ అఖిలభారత మాజీ అధ్యక్షులు వై. వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ అఖిలభారత మాజీ అధ్యక్షులు వై. వెంకటేశ్వర్లు విమర్శించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి వర్క్ షాప్ అనంతపురం నగరంలోని అంబేద్కర్ భవనంలో శనివారం ప్రారంభమైంది. శనివారం నుంచి ఈనెల 8 వ తేదీ వరకు నిర్వహించే ఈ వర్క్‌షాప్‌లో మొదటిరోజు జరిగిన కార్యక్రమంలో వై. వెంకటేశ్వర్లుతో పాటు ,మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు ప్రసన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. మొదటి రోజు సమావేశంలో భాగంగా ప్రారంభ సభలో ఎస్ఎఫ్ఐ మాజీ అఖిలభారత అధ్యక్షులు వై వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ అలుపెరగని పోరాటాలు సాగిస్తోందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని నాశనం చేయడానికి నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. దీని వల్ల దేశంలో ప్రాథమిక విద్య పూర్తి స్థాయిలో నాశనమైందన్నారు. పలు పాఠశాలలు మూతపడ్డాయని, చాలామంది విద్యార్థులు చదువుకు దూరం అయ్యారని అన్నారు. చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగం లేకపోవటంతో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడం దురదృష్టకరమన్నారు. ఈవిధానానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో వచ్చి 100 రోజులు పూర్తి చేసుకుందన్నారు. రాష్ట్ర విద్యా రంగం పై ప్రభుత్వం అభివృద్ధి శూన్యంగా ఉందన్నారు. ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు, నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచి పరిపాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. జూనియర్ కళాశాల మధ్యాహ్న భోజనం అంశంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలన్నారు. సంక్షేమ హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటిని పునర్ నిర్మించాలని డిమాండ్ చేశారు. వార్డెన్, వంట మనిషి, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్ కాస్మెటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్ విడుదల చేయాలన్నారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓతూరు పరమేష్, రామ్మోహన్, వినోద్ కుమార్, కిరణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు అబ్దుల్లా, రవి, వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు రజిత, అమూల్య, అనంతపురం జిల్లా అధ్యక్షులు సిద్ధు, ఉపాధ్యక్షులు వైటిసి రమేష్, శివ, వంశీ, సూర్య, భీమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

లక్షమందితో టిడిపి సభ్యత్వం

పార్టీలో గ్రూపులకు తావులేదు-ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో లక్ష మందికి తగ్గకుండా సభ్యత్వం నమోదు చేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. శనివారం అనంతపురం నగరంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పార్టీ అధిష్టానం మనపై ఎంతో నమ్మకంతో పైలెట్ ప్రాజెక్టుగా మన నియోజకవర్గాన్ని ఎంపిక చేశారన్నారు. ఈ నెల 9వ తారీకు నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఈ నమ్మకాన్ని వమ్ము చేయకుండా సభ్యత్వ నమోదు రికార్డు స్థాయిలో జరిపించేలా కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు లక్ష్మీనారాయణ, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్ మురళీధర్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గాజుల ఆదెన్న, రాయల్ మురళి, పార్టీ సీనియర్ నాయకుడు గంగారామ్, పద్మశాలి ఫెడరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీ నరసింహులు, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ గౌస్ మొహిద్దిన్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

పార్టీలో గ్రూపులకు తావు లేదు..

ఇటీవల కొంత మంది టిడిపి గ్రూపులు ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్ గ్రూపు మాత్రమే ఇక్కడ ఉంటుందన్నారు. పార్టీలో కష్టపడిన వారికి ఎప్పటికీ ప్రాధాన్యం ఉంటుందన్నారు. తాజాగా నామినేటెడ్ పోస్టుల్లో లక్ష్మీనారాయణ, లక్ష్మీనరసింహకు పదవులు వచ్చాయంటే వారు పార్టీ కోసం కష్టపడటమే అన్నారు. తన గెలుపు కోసం కష్టపడిన ఏ ఒక్కర్నీ మర్చిపోలేదని.. కచ్చితంగా అందరికీ తగిన సమయంలో గుర్తింపు దక్కుతుందన్నారు. పార్టీలోనైనా, ప్రజలకైనా ఎక్కడ ఎవరికి చిన్న కష్టం వచ్చినా.. నాతో నేరుగా చెప్పుకోవచ్చన్నారు. నాకు తెలియకుండా చిన్న చిన్న తప్పులు జరిగినా.. అవి నా దష్టికి తీసుకొస్తే కచ్చితంగా పరిష్కారిస్తామని దగ్గుపాటి అన్నారు.



స్టాకిస్టుకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

సివిల్ సప్లయ్ కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-తాడిపత్రి

సివిల్ సప్లయ్ గోడౌన్‌లో పని చేస్తున్న కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించడంతోపాటు హెల్త్‌క్యాంపులు ఏర్పాటు చేయాలని సిఐటియు నాయకులు జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సివిల్ సప్లయ్ గోడౌన్‌లో స్టాకిస్టు శంకరయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు గత 20 సంవత్సరాలుగా హమాలీలుగా పని చేస్తూ అనారోగ్య పాలవుతున్నారన్నారు. తమకు గోడౌన్‌లో ఎలాంటి సౌకర్యాలూ కల్పించలేదన్నారు. కనీసం తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు. చాలా ఏళ్లుగా బరువుతో కూడిన బియ్యం మూటలు మోసి మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నా ఎలాంటి ఆరోగ్య భద్రత లేదదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సివిల్ సప్లయ్ కార్మికుల సౌకర్యార్థం ఆరోగ్య భద్రత కల్పించడంతోపాటు ప్రతినెలా హెల్త్‌క్యాంప్ ఏర్పాటు చేయాల ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు హనుమంతురెడ్డి, హనుమంతురెడ్డి, కెవిపిఎస్ నాయకులు నాగరాజు, రామ్మోహన్, శ్రీరాములు, హమాలీ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు సిఐటియు లేఖ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించి సమ్మెను విరమింపజేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సిఐటియు ఆధ్వర్యంలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు మెయిల్ ద్వారా లేఖ పంపారు. తాగునీటి సరఫరా కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించాలని సెప్టెంబర్ 5 నుంచి 17వ తేదీ వరకూ సమ్మె నిర్వహించిన సందర్భంగా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ప్రభుత్వం నుంచి ఇచ్చిన హామీ మేరకు కార్మికుల సమ్మె వాయిదా వేశారని తెలిపారు. అయితే 13 రోజుల తర్వాత కూడా ఎలాంటి స్పందన లేనందున తిరిగి కార్మికులు సెప్టెంబర్ 29వతేదీ నుంచి సమ్మెను కొనసాగిస్తున్నారని తెలిపారు. అయినా ఇంతవరకూ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల కార్మికులు పండుగ రోజుల్లో కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా ప్రతినిధిగా మంత్రిగా జోక్యం చేసుకుని కార్మికులకు వేతనాలు బకాయి పీఎఫ్ చెల్లించేటట్లుగా చర్యలు తీసుకుని, కార్మికుల సమ్మెను ఉపసంహరింప చేయాలని విజ్ఞప్తి చేశారు.

పూర్తిస్థాయిలో ఉచిత ఇసుకను అమలు చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో ఇసుక లభించకపోవడం, రేట్లు పెరిగిపోవడం, విచ్చలవిడి అవినీతి కారణంగా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడి రాజకీయ మార్పునకు దారితీసిందన్నారు. ఎన్నికల ముందు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఎన్నికల అనంతరం విస్మరించారన్నారు. వందరోజుల పాలనలో ఇసుక విషయంలో గత ప్రభుత్వానికి.. కూటమి ప్రభుత్వానికి తేడా లేకుండా పోయిందన్నారు. అనేకచోట్ల ఇసుక లభించడం లేదన్నారు. మరికొన్ని చోట్ల అధికార పార్టీ నాయకులే అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉచిత ఇసుకను అమలు చేయాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, పుల్లన్న, రుషింగప్ప, చంద్ర, కొండారెడ్డి, సుంకన్న, రామాంజనేయులు, నరేంద్ర, ఆంజనేయులు, కుళ్లాయిస్వామి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

షికారీల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

షికారీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఎస్టీ కమిషనర్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ తెలిపారు. శనివారం నగరంలోని బుడ్డప్పనగర్ ప్రభుత్వ పాఠశాలలో షికారీలతో పలు సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షికారీలపై ప్రేమతో మంచి చేయడానికి ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలను చేపడుతోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవడంలో మనవైపు నుండే జాప్యం జరుగుతోందన్నారు. ముఖ్యంగా జిల్లాలోని ఆర్‌డిటి, పోలీస్ శాఖ, రెవెన్యూ, విద్యాశాఖలు అనేక కార్యక్రమాలను చేపడుతున్నాయన్నారు. వారందరికీ మనం ఎప్పుడూ రుణపడి ఉంటామన్నారు. అనంతపురం పలు సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ఎన్టీఆర్‌కాలనీ వద్ద ఉన్న షికారీ కాలనీలో 88 కుటుంబాలు నివసిస్తున్నాయని, పిల్లల సంఖ్య 124 ఉన్నవని, వీరిలో 39 మంది పిల్లలు బడిలో చేరకుండా ఉన్నారని, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వీరందరినీ బడిలో ఉండేటట్టు చూడాలని మండల విద్యాశాఖ అధికారిని కోరారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి జిల్లాలోని గిరిజనుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, అనంతపురం తహశీల్దార్ మోహన్, అనంతపురం సీఐ విశ్వనాథచౌదరి, ఎంఇఒ వెంకటస్వామి, ఆర్‌డిటి కోఆర్డినేటర్ మల్లికార్జున, గిరిజన నాయకులు ఆనంద్, మల్లికార్జుననాయక్, స్వామినాయక్, భాస్కర్‌నాయక్, విజయ్‌నాయక్, ప్రసాద్‌నాయక్, లక్ష్మానాయక్, హనుమంతునాయక్, తదితరులు పాల్గొన్నారు.



పెద్దవడుగూరు మండలం పులేటివాగులో చిక్కుకున్న పంటనూర్పిడి యంత్రంలో పాటు వ్యక్తులు

విస్తారంగా వర్షాలు

◆ నిండిన కుంటలు, చెక్‌డ్యాములు ◆ పరవళ్లు తొక్కిన వాగులు, వంకలు
◆ నీటమునిగిన పొలాలు ◆ బొమ్మనహాల్‌లో అత్యధిక వర్షపాతం

ప్రజాశక్తి - బొమ్మనహాల్

శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి వేదావతి, కబ్బాలంక పరవళ్లు తొక్కుతోంది. మండలంలోని ఉదేహాల్, బండూర్, లింగ దహాల్, బొమ్మనహాల్ గ్రామాల్లోని నివాసాల్లోకి వర్షపునీరు చేరింది. సుమారు 200 కుటుంబాలకు చెందిన నిత్యవసర సరుకులు, వస్త్రాలు నీటతడిచాయి. ఆయా గ్రామాల్లో డ్రయినేజీలు బ్లాక్ కావటంత్తో వర్షపు నీరు గృహాల్లోకి చేరింది. పలు చోట్లు పొలాలు నీటమునిగాయి. వేదావతి యేరు పరుగులు తీసిన సమయం ప్రతిసారి పేదల గృహాల్లోకి వర్షపు నీరు చేరుతుందని దీంతో తినే వస్తువులు, దుస్తులు కొట్టుకుపోయి ఇబ్బందులకు గురి అవుతున్నామని బాధితులు వాపోతున్నారు. ఇక బొమ్మనహాల్ గ్రామంలోని ఎన్టీఆర్ కాలనీ, రెవిన్యూ కాలనీ, విద్యుత్ కార్యాలయంలో వర్షపు నీరు చేరింది. భారీ వర్షానికి ఉద్దేహాల్, బండూరు, బొమ్మనహాల్, బొల్లనగుడ్డం, కళ్ళు దేవనహళ్లి గ్రామాల్లో సాగుచేసిన వరి, మొక్కజొన్న పంట నీట మునగడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

పెద్దవడుగూరు : మండలంలోని వీరన్నపల్లి సమీపంలో ఉన్న పులేటి వాగు ఉధృతంగా ప్రవహించడంతో అటుగా దాటుకునే ప్రయత్నం చేసిన నూర్పిడి యంత్రం ట్రాక్టర్ వాగులో ఇరుక్కుపోయింది. శుక్రవారం రాత్రి మండలంతోపాటు పైతట్టు ప్రాంతాల్లో కురిసిన వర్షానాకి పుల్లేటి వాగు ఉధృతంగా ప్రవహించింది. వాగులో ఉన్న దారిలో అటువైపు వెళ్లవచ్చునని చిత్రచేడుకు చెందిన రాము అనే వ్యక్తి నూర్పిడియంత్రం ట్రాక్టర్తో వెళ్తుండగా మధ్యలోకి వెళ్లాక గుంతలో ఇరుక్కుపోయింది. దీంతో వారు వాగులో ఇరుక్కుపోయారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ ఉషారాణి, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప ఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తుల సహకారంతో వాగులో ఇరుక్కుపోయిన నూర్పిడి యంత్రం ట్రాక్టర్‌ను జెసిబి సాయంతో బయటకు తీయించారు. దీంతో అందులో ఉన్న వ్యక్తులు బయటపడ్డారు.

రాయదుర్గం : శుక్రవారం రాయదుర్గం నియోజకవర్గం లో వర్షం జోరుగా కురిసింది. బొమ్మనహాల్ లో 148 మిల్లీమీటర్లు, రాయదుర్గంలో 75.6, డి హీరేహాల్ లో 59.8, కనేకల్‌లో 54, గుమ్మగట్టలో 36.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. హీరేహాల్ మండలం సోమలాపురం వద్ద గంగమ్మ వంక ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాయదుర్గం– బళ్ళారి మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. వంకలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటం వల్ల నీటిలో వెళ్ళే సాహసం చేయవద్దని అధికారులు ప్రయాణికులకు సూచిస్తున్నారు. డి హిరేహాల్ మండలం బాదనహాల్ నుండి దొడగట్ట గ్రామానికి వెళ్లే రహదారి కోతకు గురైంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతిని కోతకు గురైంది. దీంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. దారి కోతకు గురి కావడంతో వాహనదారులు ఇబ్బందికి గురి కావడంతో స్పందించిన తెలుగుదేశం పార్టీ మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి కాదులూరు మోహన్ రెడ్డి జెసిబి, ట్రాక్టర్ల సాయంతో కోతకు గురైన రహదారిని బాగు చేయించారు.

రబీ ఆశాజనకం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రబీ సీజన్ అక్టోబరు మొదటి నుంచి ప్రారంభమైంది. అప్పటి నుంచి వర్షాలు ఆశాజనకంగా పడుతున్నాయి. ఖరీఫ్‌లో చివర్లో సెప్టంబరులో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండేవి. ఈ నెల మాత్రం ఇప్పటికే సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదయింది. మండలాల వారీగా చూస్తే పుట్లూరు, యల్లనూరు, తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాలు మినహా తక్కిన అన్ని మండలాల్లో మంచి వర్షపాతమే అక్టోబరులో నమోదయింది. అక్టోబరు నెల ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 34.7 మిల్లీమీటర్లుకు కురవాల్సి ఉండగా 45.6 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 31.7 శాతం అధికంగా వర్షపాతం పడింది. అదే సెప్టంబరు నెలలో చూస్తే సాధారణ వర్షపాతం 110.9 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 48.4 మిల్లీమీటర్లు మాత్రమమే పడింది.

బొమ్మనహాళ్‌లో అత్యధికం

అనంతపురం జిల్లాలో బొమ్మనహాళ్ మండలంలో ఈ నెలలో అత్యధికంగా 567.8 శాతం అధికంగా వర్షపాతం పడింది. సాధారణ వర్షపాతం ఈ నెలలో ఇక్కడ 24.5 మిల్లీమీటర్లు అయితే నమోదయిన వర్షపాతం 163.6 మిల్లీమీటర్లు. శనివారం ఒక్క రోజే ఇక్కడ 148 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఆ తరువాత డీ.హరేహాళ్‌లో సాధారణ వర్షపాతం 9.8 మిల్లీమీటర్లకుగానూ 59.8 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే ఇక్కడ 319 శాతం అధికంగా వర్షపాతం నమోదయింది. కణేకల్‌లో 219.4 శాతం అధిక వర్షపాతం నమోదయింది. ఈ మండలంలో సాధారణ వర్షపాతం 22.2 మిల్లీమీటర్లు అయితే పడింది70.9 మిల్లీమీటర్లు. గార్లదిన్నె, పామిడి, రాయదుర్గం మండలాల్లోనూ సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయింది. ఇక అత్యల్పంగా చూస్తే యల్లనూరులో 89 శాతం తక్కువ వర్షపాతం నమోదయింది. ఇక్కడ సాధారణ వర్షపాతం 51.1 మిల్లీమీటర్ల అయితే 5.5 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయింది.



బొమ్మనహాల్ మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వేదావతి యేరు



హీరేహాల్ మండలంలో ప్రవహిస్తున్న వాగు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగరాజు సహకారంతో న్యాయ అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, వార్డు పర్యావరణ, పారిశుధ్య కార్యదర్శులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, పబ్లిక్ హెల్త్‌వర్కర్లతో కలిసి స్వచ్ఛత హి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కోర్టు ఆవరణలోని పరసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారం కోసం ప్రతి భారతీయుడూ పని చేయాలని పిలుపునిచ్చారు. అంతేగాకుండా ప్రతి ఒక్కరూ శుభ్రతపై అవగాహన ఉండాలన్నారు. మానవాళికి పర్యావరణంపై అవగాహన, ప్రేమ, స్పృహ తప్పకుండా ఉండాలన్నారు. అదేవిధంగా పర్యావరణం బాగుంటే సకాలంలో వర్షాలు పడి జీవవైవిధ్యం బాగా ఉంటుందన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, డిఎల్ఎస్ఎ సెక్రటరీ శివప్రసాద్, ఎంహెచ్ఒ జి.విష్ణుమూర్తి, ప్రజారోగ్య విభాగం సిబ్బంది పాల్గొన్నారు

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు కళాశాల పరిసరాల్లోని వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత విషయంలో ఎవరూ రాజీ పడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు ఫరీషా, బాబు, ప్రసాద్, విజయ్‌కుమార్, వెంకటేష్, దేవదాసు, పాలరాజు, రఘు, మల్లికార్జున, చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, కోదండరాములు, నాగప్ప, ఎన్‌సిసి క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

'స్వచ్ఛత' కార్యక్రమంలో వక్తలు



స్వచ్ఛతపై అనంతపురం కోర్టులో అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

గుత్తి : స్వచ్ఛ గ్రామాలు, పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు నివాస పరిసరాలు, వీధుల్లో పరిశుభ్రత పాటించాలని గుత్తి మండల న్యాయ సేవా సమితి అధ్యక్షులు, జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీహరి పిలుపునిచ్చారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం న్యాయస్థానాల ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.కాశీవిశ్వనాథాచారితో కలిసి పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. చీపురు పట్టి చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో రోగాలు దరిచేరవన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్‌మియా, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, సీనియర్ న్యాయవాదులు, ప్యానల్ అడ్వకేట్లు, కోర్టు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని శ్రీరామిరెడ్డి తాగునీటి పంపుహౌస్ వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె శనివారానికి 7వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ గ్రామాలకు తాగునీరు అందిస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా వేధించడం మంచిది కాదన్నారు. ప్రజల దాహార్తిని తీర్చడానికి రాత్రి, పగలు తేడా లేకుండా పని చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని కార్మికులకు అందాల్సిన ఏడునెలల వేతనాలు, 12నెల పిఎఫ్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు నరేష్, నాగరాజు, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న కార్మికులు

విజ్ఞానశాస్త్రం దినదినాభివృద్ధి

ఎస్‌వి విద్యాసంస్థల వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

విజ్ఞానశాస్త్రం దినదినాభివృద్ధి చెందుతోందని ఎస్‌వి విద్యాసంస్థల వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని జీసెస్‌నగర్‌లో ఉన్న ఎస్‌వి, పీజీ కళాశాలలో రీజినల్ లెవెల్ స్టూడెంట్ టెక్నికల్ సెమినార్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞానశాస్త్రం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న తరుణంలో విద్యార్థులు మెళకువలను తెలుసుకోవాలన్నారు. నిరంతరం విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లాలన్నారు. ఎస్‌కెయు ఆచార్యులు డి.మురళీధర్‌రావు మాట్లాడుతూ విజ్ఞానశాస్త్రం అభివృద్ధి చెందుతున్నప్పటికీ మానవాళికి ఉపయోగపడేవిదంగా ఉండాలన్నారు. అంతేకాకుండా జీవసాంకేతిక శాస్త్రం, మైక్రోబయాలజీ, రసాయనశాస్త్రం, ఆహార, సాంకేతిక శాస్త్రం భవిష్యత్తుకు మరింత ఉత్తేజకరమైన పరిణామాలు, ఆవిష్కరణలకు అవకాశాలను కల్పిస్తాయన్నారు. తర్వాత వివిధ కళాశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన పోస్టర్లను తిలకించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంశాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు బి.నరసింహారెడ్డి, ఎం.మహమ్మద్‌రఫీ, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌ఎవి.ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, ఎఒ శ్రీనాథ్, కన్వీనర్ ఎస్.రిజ్వానాబేగం, కో.కన్వీనర్ ఎం.కళ్యాణ్‌చక్రవర్తి, పి.జ్యోతి, జి.సాయిప్రీతి, ఎం.నాగప్రతిమ, టి.సుదర్శన్, జి.ఆనంద్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వి విద్యాసంస్థల వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి

ఇళ్లలో చెత్తను కార్మికులకు అందజేయాలి

కమిషనర్ నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగర ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను ట్రాక్టర్ వచ్చినప్పుడు పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కమిషనర్ నాగరాజు సూచించారు. శనివారం నగరంలోని డిఆర్‌డిఎ సమీపంలోని జిమ్ సెంటర్‌లో పట్టణ సమాఖ్య రీసోర్స్‌పర్సన్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకరమైన చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నట్లు తెలిపారు. చెత్తను వేరు చేసి మీ ఏరియాకు ట్రాక్టర్ వచ్చినప్పుడు కార్మికులకు అందజేయాలన్నారు. చెత్తను కాలువలో వేయకూడదన్నారు. ప్లాస్టిక్ కవర్స్ వాడటం వల్ల ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు వస్తాయో వివరించారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నియంత్రించాలన్నారు. మార్కెట్, బిజినెస్ సెంటర్లలో ఎస్‌జిహెచ్ గ్రూపుల వారితోనే క్లాత్‌బ్యాగుల షాపులు పెట్టిస్తామన్నారు. క్లాత్ కొనుగోలు కూడా తక్కువ ధరకే ఉండేటట్లు చూస్తానని వివరించారు. తర్వాత మెప్మా సబ్జెక్ట్స్ విజన్ 2047 క్యూఆర్ కోడ్ గురించి వివరించారు. ఈ సమావేశంలో టౌన్ మెప్మా ప్రాజెక్టు మేనేజర్ విశ్వజ్యోతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పార్వతి, కళావతి, శిరీషా, వైజయంతి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన అంబికా విక్షిత్



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎంపీ కొడుకు విక్షిత్

అనంతపురం కలెక్టరేట్ : ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తనయుడు అంబికా విక్షిత్ శనివారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తర్వాత పార్లమెంట్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కరించాలని కలెక్టర్‌కు విన్నవించారు.

పప్పుశనగ కోసం 550 మంది రిజిస్ట్రేషన్

పుట్లూరు : మండల వ్యాప్తంగా రెండవరోజు శనివారం పప్పుశనగ కోసం 550 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు ఎఒ కాత్యాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 751 క్వింటాళ్ల పప్పుశనగలు అవసరమవుతాయన్నారు.

గుత్తి ఎక్సైజ్ సిఐగా పి.గురునాథరెడ్డి



గుత్తి : గుత్తి ఎక్సైజ్ సిఐగా పి.గురునాథరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సిఐ శివసాగర్ గుంతకల్లుకు బదిలీపై వెళ్లారు. దీంతో మడకశిర మొబైల్ పార్టీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న పి.గురునాథరెడ్డి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 18 మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు. గుత్తి 7, యాడికి 4, పెద్దవడుగూరు 3, పామిడి 4 దుకాణాలు కేటాయించినట్లు వివరించారు. ఆయా దుకాణాల నిర్వహణకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆశావాహులు ఈనెల 9వతేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 11న దుకాణాలు కేటాయిస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

రాయదుర్గం రూరల్ : గుమ్మఘట్ట మండలంలోని తాళకెర గ్రామంలో గంగమ్మ ఆలయ నిర్మాణానికి రాయదుర్గం నియోజకవర్గ వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు బండి క్రిష్టప్ప శనివారం రూ.5,100 విరాళం అందించారు. సంబంధిత మొత్తాన్ని బెస్త సామాజిక వర్గానికి చెందిన శ్రీరాములు, నాగేంద్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సేవాసమితి ఉపాధ్యక్షుడు మలకన్న, కోశాధికారి బండి చంద్రశేఖర్, ప్రధాన సలహాదారులు రాజప్ప, సభ్యులు రఘు, సిద్ధప్ప, రాముడు, తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న బండి కిష్టప్ప

ఊళ్లకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

సిసిఎస్ సిఐ ఇస్మాయిల్



ప్రజాశక్తి-అనంతపురం క్రైం

దసరా పండుగకు ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లేవారు చోరీలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానిక సిసిఎస్ సిఐ ఇస్మాయిల్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ఇప్పటికే ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా వేశామన్నారు. దీంతోపాటు ప్రజలు సహకరించి సిసిఎస్ పోలీసులు సూచించిన కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డబ్బు, విలువైన ఆభరణాలను ఇంట్లో ఉంచి వెళ్లకూడదని సూచించారు. రాత్రివేళ అనుమానంగా సంచరించే వారిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తాళం వేసిన ఇళ్ల వద్దకు ఉదయం అపరిచిత వ్యక్తులు వచ్చినట్లు తెలిస్తే అప్రమత్తం కావాలన్నారు. ఇరుగు, పొరుగు వారిని తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం మంచిదన్నారు. వీలైనంత త్వరగా ప్రయాణం ముగించుకుని వచ్చేలా చూసుకోవాలన్నారు. పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని హెచ్చరించారు. ఖరీదైన వస్తువులను బ్యాంకు లాకర్‌లో పెట్టుకోవాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బయటకు వెళ్లేటప్పుడు తాళాలను ఒకటికి, రెండు సార్లు సరిచూసుకోవాలన్నారు.

సైబర్ నేరాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

దసరా పండుగ సందర్భంగా పెద్ద, పెద్ద కంపెనీలు మంచి ఆఫర్లు ఇచ్చినందున.. ఇదే అదునుగా భావించి సైబర్ నేరాళ్లు నకిలీ ఐడి క్రియేట్ చేసి ప్రజలను మోసం చేసే అవకాశం ఉందన్నారు. అలాంటి వారి పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారు మోసపోయి విలువైన డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. అవసరం లేకుండా వచ్చే మెసేజ్‌ల్లో బ్లూ కలర్ లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. లాటరీ తగిలిందని, ఏదో గిఫ్ట్ వచ్చిందని, కారు వచ్చిందని, బైక్ వచ్చిందని, డబ్బులు వచ్చాయని, విలువైన వస్తువులు తక్కువ ధరకు ఇస్తామని వచ్చే లింకులను ఓపెన్ చేసి మోసపోవద్దన్నారు. అలాగే ఇళ్లలోకి వచ్చి వృద్ధ మహిళలు ధరించిన ఆభరణాలు లాక్కెళ్లే ప్రమాదముందన్నారు. సైబర్ నేరానికి గురైన వెంటనే 1930కి కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పేదల కడుపు నింపడమే అన్న క్యాంటీన్ల లక్ష్యం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పేదల కడుపు నింపడమే లక్ష్యంగా అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని రాణీసత్రం ప్రయివేటు బస్టాండ్ ఆవరణలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయిలో లక్షలాది మంది పేదలకు అన్నం పెట్టారన్నారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్లను మూసివేసి పేదల కడుపు కొట్టిందన్నారు. అయితే తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అన్న క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభిస్తున్నట్లు వివరించారు. ఇకపోతే అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్ర ప్రభుత్వం మొదటి స్థానంలో ఉండాలన్న ఉద్దేశంతో అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే పింఛన్ల పెంపు, ఉద్యోగులకు మొదటి తారీకు జీతాలు, పేదలకు ఆకలి తీర్చే అన్న క్యాంటీన్‌లను ప్రారంభించామని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో కూడా ప్రజలు ప్రభుత్వానికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు ప్రశాంతి, జ్యోతి, పద్మజ, మాజీ సభ్యులు భారతి, సుమలత, వాణి, పి.పురుషోత్తం, మాజీ వైస్ చైర్మన్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.


అన్నక్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాలవ

బౌన్స్ కిడ్స్ క్లబ్ గేమింగ్ జోన్ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బౌన్స్ కిడ్స్ క్లబ్ గేమింగ్ జోన్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా సిటీలకు పరిమితమైన కిడ్స్ గేమింగ్ జోన్‌ను అనంతపురం ప్రజలకు పరిచయం చేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు గుత్తా ప్రభాకర్ నాయుడు, సుధీర్‌కుమార్ సింధూర మాట్లాడుతూ అతిపెద్ద నగరాలకు పరిమితమైన పిల్లల వినోదభరితమైన గేమింగ్ జోన్ అనంతపురం ప్రజలకు చేరువ చేయాలనే సదుద్దేశంతో బౌన్స్ కిడ్స్ క్లబ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బౌన్స్ కిడ్స్ క్లబ్ గేమింగ్ జోన్‌లో అతి చిన్న పిల్లల కోసం సాఫ్ట్ ప్లే, పెద్ద పిల్లల కోసం గేమింగ్ మిషన్స్ ఆర్కేడ్ మిషన్స్ పరిచయం చేస్తున్నట్లు చెప్పారు. స్నాక్స్ ఫుడ్ సెక్షన్ కూడా అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజారావు, గంగారావు, తదితరులు పాల్గొన్నారు.


గేమింగ్ జోన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ఆసుపత్రి సలహా మండలి సర్వసభ్య సమావేశం

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఆసుపత్రి సలహా మండలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి కమిటీ ఛైర్‌పర్సన్ హోదాలో ఎంపిపి డి.సునీత హాజరై ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే కార్యక్రమాలు, రోగులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారు.. వచ్చిన నిధులు.. వాటి వివరాలు.. భవిష్యత్తులో ఎలాంటి వైద్య సేవలు అందిస్తారనే విషయాలపై చర్చించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ వైద్యాధికారి స్వాతిలక్ష్మి, సభ్యులు కల్పనారెడ్డి, మానేరు కొండమ్మ, వైద్య సిబ్బంది మోహన్‌రావు, సిహెచ్‌ఒ, పిహెచ్‌ఎన్ చెన్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ సునీత, ఫార్మాసిస్టు మహబూబ్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు, ధనుంజయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి సునీత


పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

బయోమెట్రిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవడుగూరు : ప్రస్తుతం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంట నమోదు కార్యక్రమం అనంతరం బయోమెట్రిక్ విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ కోరారు. శనివారం మండలంలోని చిత్రచేడు, మొలకతాళ్ల, కిష్టిపాడు, అప్పేచెర్ల గ్రామాల్లో పంట నమోదు, ఇకెవైసి కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం చిత్రచేడులోని సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. తర్వాత ఇకెవైసి వేయని రైతుల వివరాలను అడిగి తెలుసుకుని రైతుల వద్దకే వెళ్లి ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఒ శంకర్‌లాల్‌నాయక్, వ్యవసాయ విస్తరణాధికారిణి సునీత, రైతు సేవాకేంద్రం అధికారులు నరేష్, పద్మ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తులు స్వీకరణ



బుక్కరాయసముద్రం : నియోజకవర్గంలోని శింగనమల, నార్పల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం మండలాలకు సంబంధించి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న 15 మద్యం దుకాణాలకు ఆన్‌లైన్ ద్వారా టెండర్ల దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ నాగసునీత శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాంటి వారికి ఎక్సైజ్ కార్యాలయం నుంచి ఎలాంటి సహకారమైనా అందిస్తామన్నారు. ఈనెల 9వతేదీ వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఆప్లికేషన్ ఫీజు రూ.2లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయించనున్నట్లు తెలిపారు.

కొత్తసీసాలో పాత సారా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



కొత్త సీసాలో పాత సారా అన్న చందంగా మారింది ప్రభుత్వ పాలన అన్న విమర్శ వినిపిస్తోంది. ప్రతిపక్షంలో ఉండగా అన్నీ సమస్యలుగానే కనిపిస్తాయి. అధికారంలోకి వస్తూనే ఆ సమస్యలు సమస్యలు కాకుండా కొత్త పద్దతుల్లో పాత విధానాలే అమలుకు నోచుకుంటూ ఉండటం పరిపాటి. ప్రభుత్వం మారితే విధానం మారుతుందని భావించి ఓటు వేసిన ఓటరుకు తిప్పలు మాత్రం అవే మిగులుతూ ఉంటాయి. ప్రతిపక్షంలో ఉండగా టిడిపి మద్యం పెద్ద ఎత్తున విమర్శలే చేసింది. మద్యం ఏరులైనా పారిస్తోంది. నాణ్యమైన మద్యం లేదంటూ ఆరోపించింది. అంతేకాకుండా వాటి ధరలపైనా విమర్శలు చేసింది. అధికారంలోకి వస్తూనే గాంధీ జయంతి రోజేనే కొత్త మద్యం టెండర్లకు గెజిట్‌ను జారీ చేసింది. ఈ నెల 11వ తేదిన దీనికి టెండర్లను కూడా ఆహ్వానించారు. అది చూస్తే ప్రభుత్వం పెద్దఎత్తున డబ్బులను దీని ద్వారా రాబట్టే ఆలోచన ఉన్నట్టు కనిపిస్తోంది. అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాలు, సత్యసాయి జిల్లాలో 87 మద్యం దుకాణాలకు టెండర్లు ఆహ్వానించింది. దీనికి ఏకంగా రెండు లక్షలు ఒక దరఖాస్తును నాన్ రిఫండబుల్ మొత్తాన్ని కేటాయించడమే కాకుండా రూ.50 లక్షల నుంచి రూ.80 లక్షలు మొత్తాన్ని ప్రభుత్వానికి ముందుగా టెండరు దక్కిన వారు చెల్లించాలి. దీని ద్వారా ప్రభుత్వానికి ఎంత పెద్ద ఎత్తున ఆదాయం సమకూరనుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ వారంలో దరఖాస్తులు చేసుకునేందుకు చాలా మంది సిద్ధమవుతున్నారు. అందులో అధికారపార్టీ ప్రజాప్రతినిధులే ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. ఎందుకంటే తమ ప్రాంతంలో ఈ వ్యాపారం తమ చేతుల్లో పెట్టుకుని ఆదాయం సమకూర్చుకునే ఆలోచనలోనున్నట్టు కనిపిస్తోంది. ఇప్పటికే పోటీదారులకు అటువంటి సంకేతాలను పంపిస్తుండటం గమనార్హం. దీని ద్వారానే ఒక్క అనంతపురం జిల్లాలోనే మద్యం వ్యాపారం ఏడాదికి రూ.500 కోట్ల మేరకు జరిగే అవకాశాలున్నాయి. గతంలో ఇదే స్థాయిలో మద్యం విక్రయాలు జరిగాయి. ఇకపోతే మద్యం ధరలపైనా మద్యం ప్రియుల్లో పెద్దగా సంతృప్తి లేనట్టు తెలుస్తోంది. పాత ధరలకు కొద్దిగా అటుఇటుగానే ధరలుండే అవకాశాలున్నాయని వాపోతున్నారు. ఇసుక విషయంలోనూ ప్రభుత్వ తీరు అదే రకంగా ఉందన్న విమర్శ ఉంది. ఉచిత ఇసుక అని పేరు పెట్టినప్పటికీ రవాణ, సీనరేజీ ఛార్జీలు అన్నీ కలిపి చూస్తే గతం కంటే నామ మాత్రపు వ్యత్యాసం మాత్రమే ఉంది. అంతేకాకుండా దోపిడీ యధావిధిగా కొనసాగుతోంది. అయితే నేతలు మాత్రమే మారారు. ప్రభుత్వం దోపిడీని ఆపుతామని ప్రకటనలు చేస్తున్న ఆచరణలో మాత్రం కొనసాగుతూనే ఉంది. సామానుల్లో మాత్రం మద్యం, ఇసుక విషయంలో గతానికి ఇప్పటికీ పెద్ద తేడాది ఏదీ లేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇక ఈ వారంలో వర్షాలు పడుతున్నారు. సెప్టంబరులో వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉండగా అక్టోబరు మొదటి నుంచి వర్షాలు జిల్లా వ్యాప్తంగా పడుతున్నాయి. ఒకవైపు రబీ సీజన్ ప్రారంభంలోనే పడుతున్నాయి. ఖరీఫ్‌లో ఒక నెల బాగా పడితే మరో నెల వర్షాభావం పంటలు పెద్దగా రాలేదు. అయితే రబీ ప్రారంబంలో రావడం సాగుకు కొంత ఆశాజనంగానే ఉందని చెప్పాలి.ప్రభుత్వం సబ్సీడీ పప్పుశనగ విత్తనాలు పంపిణీని చేపట్టింది.

సిపిఎం ప్రాంతీయ కార్యదర్శిగా ఎ.రంగారెడ్డి



ఉరవకొండ : సిపిఎం ఉరవకొండ ప్రాంతీయ కార్యదర్శిగా నెరిమెట్ల గ్రామానికి చెందిన ఎ.రంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ఉరవకొండ సిపిఎం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బాలరంగయ్య, శ్రీనివాసులు అధ్యక్షతన మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉరవకొండ, విడపనకల్లు, బెళుగుప్ప మండలాల ప్రాంతీయ కార్యదర్శిగా రంగారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో పార్టీ నిబంధనలకు లోబడి రైతులు, కార్మికులు, ప్రజా సమస్యలపై పోరాటాలు సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులుగా మధుసూదన్, జి.సీనప్ప, జ్ఞానమూర్తి, రామాంజనేయులు నాయక్, మురళి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన

కళ్యాణదుర్గం : పట్టణంలోని ఎస్‌విజిఎం డిగ్రీ కళాశాలలో శనివారం ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం వంటిది అన్నారు. కావున 17 సంవత్సరాలు నిండిన ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

దీపికకు డాక్టరేట్



అనంతపురం : శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, అండ్ టెక్నాలజీ విభాగ అధిపతి వి.రఘునాథ్‌రెడ్డి పర్యవేక్షణలో యజమాని దీపికకు డాక్టరేట్ ప్రదానం చేశారు. దీపిక డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఆఫ్ యూరిస్టిక్ మోడల్స్ టు ఇంప్లిమెంట్ సెక్యూర్ ఎనర్జీ ఎ ఫిసిఎన్స్ రూటింగ్ ప్రోటోకాల్స్ ఫర్ ఎన్ రీచ్‌మెంట్ ఆఫ్ ది లైఫ్ టైమ్ ఆఫ్ వైర్‌లెస్ సెన్సార్ నెటవర్క్ యూజింగ్ క్యలర్నింగ్ టెక్నిక్ అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రధానం చేసింది.

వృత్తివిద్యపై శిక్షణ

యల్లనూరు : మండల పరిధిలోని తిమ్మంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం గ్రామ సచివాలయంలో వృత్తి విద్యకోర్సులో శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష స్కిల్ డెవలప్‌మెంట్, టైమ్స్ సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో వృత్తి విద్యపై విద్యార్థులకు శిక్షణతోపాటు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటేష్, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నార్పల పంచాయతీ కార్యదర్శిగా శ్యామల



నార్పల : నార్పల మేజర్ పంచాయతీ కార్యదర్శిగా శ్యామల శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న అశ్వర్థనాయుడు సాధారణ బదిలీల్లో భాగంగా యాడికి పంచాయతీకి బదిలీ కాగా.. చెన్నేకొత్తపల్లి కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్యామల ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు, పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది, ఉన్నతాధికారుల సహకారంతో పంచాయతీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. పంచాయితీ పరిధిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

అథ్లెటిక్స్‌లో బ్రహ్మసముద్రం విద్యార్థిని ప్రతిభ

బ్రహ్మసముద్రం : రాష్ట్రస్థాయి అత్యధిక పోటీల్లో బ్రహ్మసముద్రం జూనియర్ కళాశాల ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.శకుంతల అత్యంత ప్రతిభ కనబరిచి 5వస్థానం కైవసం చేసుకున్నట్లు పిఇటి ఇబ్రహీం, ప్రధానోపాధ్యాయులు చంద్రమౌను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి జిల్లా ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన సౌత్ జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్ పోటీల్లో లాంగ్‌జంప్ ఫైనల్లో అండర్16 కేటగిరిలో శకుంతల 3.56 మీటర్లు దూకి 5వస్థానంలో నిలిచిందన్నారు.

టిడిపి సీనియర్ నేత నెట్టికంటి అశ్వర్థనారాయణ మృతి

శింగనమల : టిడిపి సీనియర్ నాయకులు అశ్వర్థనారాయణ శనివారం ఆకస్మికంగా మృతిచెందారు. ఈయన టిడిపి ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పని చేస్తున్నారు. వృత్తిరిత్యా ఉపాధ్యాయుడుగా పని చేశారు. తర్వాత టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షునిగా, నియోజకవర్గ ఉపాధ్యాయ యూనియన్ అధ్యక్షులుగా, నంద్యాల టిడిపి పరిశీలకులుగా పని చేశారు. ఈనేపథ్యంలో ఆయన మృతిచెందడంతో పార్టీ నాయకులు విచారం వ్యక్తం చేశారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

అనంతపురం : జిల్లా గ్రంథాలయ సంస్థకు అనంతపురానికి చెందిన ఉద్యోగి నెలటూరు జయశంకర్‌రెడ్డి సుమారు రూ.85వేల విలువజేసే పుస్తకాలను వితరణ చేశారు. ఆయా పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సహాయ అధికారి ఇంతియాజ్‌అహ్మద్ అందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటిభరత్, ఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్‌కుమార్, కె.జయమారుతి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి




రాయదుర్గం : కణేకల్ మండలం నల్లంపల్లి గ్రామం వద్ద ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి ఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కణేకల్ మండలం ఆదిగానిపల్లి గ్రామానికి చెందిన కురుబ ఎర్రిస్వామి తన భార్య అనారోగ్యంతో ఉండటంతో మందులు తీసుకొచ్చేందుకు కణేకల్ క్రాస్ నుంచి ఆటోలో రాయదుర్గానికి వస్తుండగా మార్గమధ్యంలో నల్లంపల్లి వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎర్రిస్వామి తీవ్రంగా గాయపడగా, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కణేకల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మట్కాబీటర్ల అరెస్టు

గుత్తి : పట్టణంలోని అమృత టాకీస్ వెనుక ఉన్న ఎస్సీ కాలనీలో మట్కా రాస్తున్న వారిపై సిఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు కె.సురేష్, అయేషాబేగం ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈదాడిలో మట్కా రాస్తున్న తపిల శివకృష్ణప్రసాద్, టి.తిరుమలేష్, యు.బాలమునిని అరెస్టు చేసి రూ.40,200 నగదు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

రూ.3లక్షలు నగదు చోరీ


ద్విచక్ర వాహనంలో నుంచి నగదు చోరీ చేస్తున్న నిందితుడు

నార్పల : మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంకు సమీపంలో వెంకటాంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు చెందిన రూ.3లక్షలు చోరీ అయింది. వివరాల్లోకి వెళ్తే... శ్రీనివాసులు భార్యతో కలిసి శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో స్టేట్‌బ్యాంకులో రూ.3లక్షలు డ్రా చేసి ద్విచక్ర వాహనం బ్యాగులో డబ్బులు ఊరికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఉల్లిపాయల ఆటో వద్ద.. బస్టాండ్ ఆవరణలో ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. తర్వాత డబ్బుల బ్యాగును తీసుకున్నావా.. అని భార్యతను అడగ్గా.. తీసుకోలేదని సమాధానం ఇవ్వడంతో లబోదిబోమన్నాడు. డబ్బు చోరీకి గురైనట్లు గమణించి వెంటనే నార్పల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ విద్యుత్ పరికరాలు రికవరీ

గార్లదిన్నె : రైతుల పంటపొలాల్లో చోరీకి గురైన వ్యవసాయ స్టార్టర్ పెట్టెలను స్వాధీనం చేసుకుని రైతులకు అప్పగించినట్లు సిఐ కౌలుట్లయ్య తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ గౌస్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ ఇప్పటి వరకూ స్టార్టర్ పెట్టెలను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. త్వరలోనే దొంగలించిన వారిని కోర్టుకు హాజరు ప్రస్తామన్నారు. ఇంకా చాలామంది రైతులకు సంబంధించిన వ్యవసాయ పరికరాలను చోరీ చేసిన వాటిపై విచారణ జరుగుతోందన్నారు. మిగిలిన స్టార్టర్ పెట్టెలను మరియు డ్రిప్ పరికరాలను తొందరలోనే రికవరీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో జమేందారు ఫిరోజ్ ఖాన్, చిరంజీవి, బాషా, సిబ్బంది పాల్గొన్నారు